ఇంటర్ ఫలితాల్లో షైన్ ప్రభంజనం



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో యాజమాన్యం

సరయురెడ్డి, హోమప్రియ, సంజయ్

హనుమకొండ, ఏప్రిల్ 24 : ఇంటర్మీడియట్ ఫలితాల్లో షైన్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. రాష్ట్ర స్థాయిలో ఎంపీసీ, బైపీసీలో మొదటి ర్యాంకు సాధించి కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఫలితాలు సాధించారని చైర్మన్ మూగల కుమార్ యాదవ్, డైరెక్టర్లు రాజేంద్రకుమార్, మూగల రమ, రెసిడెన్షియల్ స్కూల్ క్యాంపస్ డైరెక్టర్ శ్రీనివాస్, ఐఐటీ కో-ఆర్డినేటర్ మూగుల రమేశ్ సంయుక్తంగా తెలిపారు. షైన్ విద్యాసంస్థలు మొదటి నుంచి ఇంటర్‌లో అత్యుత్తమమైన శిక్షణ అందిస్తున్నదని తెలిపారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో ఆర్ సంజయ్ 468 మార్కులు, ఎమ్ సంజయ్ 467, జీ వికాస్ 467, ఏడుగురు విద్యార్థులకు 466 మార్కులు, 8 మందికి 465 మార్కులు వచ్చాయన్నారు. బైపీసీ మొదటి సంవత్సరంలో కే సహస్ర 436, డీ ఇందు 436, వై చందన 436, ఈ సాహితి 436, బీ సాయిని వేదిత 436మార్కులు, ఎస్ సాయి ప్రశాంతి 436, ముగ్గురు విద్యార్థులకు 435 మార్కులు, మరో ముగ్గురికి 434 మార్కులు, ఇద్దరికి 430 మార్కులు, రెండో సంవత్సరం ఎంపీసీలో వీ సరయురెడ్డి 992 మార్కులు, పీ వేద 987, ముగ్గురికి 986 మార్కులు, బైపీసీలో టీ హోమప్రియ 991 మార్కులు, బీ శ్రీపూజ 990 సాధించారని పేర్కొన్నారు. రెండో సంవత్సరం ఎంపీసీలో 970 మార్కులకు 25 మంది విద్యార్థులు, బైపీసీలో 960కి పైగా 20 మంది విద్యార్థులు అలాగే మొదటి సంవత్సరం ఎంపీసీలో 460కిపైగా మార్కులు 45 మందికిపైగా, 15 మందికిపైగా విద్యార్థులు 430కిపైగా మార్కులు సాధించారని చెప్పారు. కార్యక్రమములో షైన్ విద్యా సంస్థల ప్రిన్సిపాళ్లు మారబోయిన రాజు గౌడ్, కొత్తకొండ శ్రీనివాసన్ గౌడ్, ప్రవళిక పాల్గొన్నారు.

'ఏకశిల' విజయ విహారం

విద్యార్థులను అభినందిస్తున్న ఏకశిల చైర్మన్ తిరుపతిరెడ్డి

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 24 : ఏకశిల జూనియర్ కాలేజీ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో లక్షణ(467), స్నేహ(467), ప్రతీశ్వర్(466), వీరేశ్(466), మేఘన(465), వర్ధిని(465), సాహిత్య(465), బీపీసీ విభాగంలో సంజన(436), సాత్విక(436), భావనీ(435), సీఈసీ విభాగంలో సుమయ తన్వీర్(485), శ్రీనిత్య(480), రెండో సంవత్సర ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో వర్షిత(988), శ్రీవర్ధిని(987), బీపీసీ విభాగంలో సుమనశ్రీ(986), పద్మరేఖ(986), సీఈసీ విభాగంలో.. హీనా(986) మార్కులు సాధించినట్లు ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి తెలిపారు. సమావేశంలో డైరెక్టర్ జితేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ సుధాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

జేఎన్ఎస్‌లో ఉత్సాహంగా హ్యాండ్‌బాల్ పోటీలు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 24 : హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో తెలంగాణ హ్యాండ్‌బాల్ టాలెంట్ హంట్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను కేయూ వీసీ తాటికొండ రమేశ్ ప్రారంభించారు. తెలంగాణ నుంచి 300 మంది క్రీడాకారులు (బాలురు) పాల్గొన్నారని తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన 40 మందిని స్పోర్ట్స్ ఎక్స్‌లెన్సీకి పంపిస్తామని తెలిపారు. హనుమకొండ డీవైఎస్‌వో గుగులోత్ అశోక్ కుమార్ నాయక్, కిట్స్ కాలేజీ డీన్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ రమేశ్‌రెడ్డి, దేవేందర్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కైలాశ్‌యాదవ్, ఖోఖో సంఘం కార్యదర్శి తోట శ్యామ్‌ప్రసాద్, కుసుమ సదానందం, ప్రవీణ్‌కుమార్, ఇంద్రసేనారెడ్డి, పూర్ణచందర్ పాల్గొన్నారు.

ప్రేమ ఒకరితో.. పెళ్లి మరొకరితో..

ప్రియుడిని నిలదీసిన యువతి.. సంగెం పోలీసులకు అప్పగింత

చిట్యాల, ఏప్రిల్ 24 : ప్రేమ పేరుతో యువతిని పెళ్లి చేసుకుంటానని చెప్పి మరో యువతితో పెళ్లికి సిద్ధపడిన ఘటన బుధవారం జూకల్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ నగరంలోని దేశాయిపేటకు చెందిన మునుగొండ ప్రశాంత్ అదే ప్రాంతానికి చెందిన లింగాల రవళి ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుంటానని చెప్పి హఠాత్తుగా కనిపించకపోవడంతో యువతి ఆరా తీయగా బుధవారం చిట్యాల మండలానికి చెందిన మరో అమ్మాయితో ప్రేమపెళ్లి చేసుకుంటున్నట్లు తెలిసింది. దీంతో కుటుంబ సభ్యులతో కలిసి రవళి ఫంక్షన్ హాల్‌కు చేరుకొని ప్రశాంత్‌ను నిలదీసింది. ఇరు కుటుంబాల మధ్య గొడవ జరగడంతో పోలీసులు చేరుకుని ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలు రవళి ఈనెల 22న సంగెంలో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ప్రశాంత్‌ను సంగెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

'తూర్పు' ఏఆర్వో అశ్వినీ తానాజీ వాకడే

ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఏఆర్వో, గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

వరంగల్, ఏప్రిల్ 24 : వరంగల్ తూర్పు నియోజవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని తూర్పు ఏఆర్వో, గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. బుధవారం కార్పొరేషన్‌లో ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లోకసభ ఎన్నికలపై ప్రజల అనుమానాలు నివృత్తి చేసేందుకు బల్దియాలో టోల్ ఫ్రీ నంబర్ 9701999645తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. తూర్పు పరిధిలో 230 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించనున్నామన్నారు. ఓటర్లకు నీడ కల్పించాలన్నారు. ఎన్నికలకు వారం ముందే వెబ్ కాస్టింగ్ పనులు పూర్తి చేయాలని సూచించారు. నియోజవర్గ పరిధిలో 46 ప్రైవేట్ పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఆయా కేంద్రాల నంబర్లను పెయింటింగ్ చేయించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్లు ఇప్పటికే 1511 పంపిణీ చేశామని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించడానికి బల్దియా కార్యాలయం, ఎల్‌బీ కళాశాలలో స్ట్రాంగ్ రూంలు ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాలను అమర్చాలన్నారు. పోలింగ్ మెటీరియల్‌ను ఇప్పటి నుంచే సిద్ధం చేసుకోవాలని పోలింగ్ మెటీరియల్ నోడల్ అధికారికి కమిషనర్ సూచించారు.

నిర్దేశిత ప్రమాణాల ప్రకారం భవనాలు నిర్మించాలి..

నిర్దేశిత ప్రమాణాల ప్రకారం మేరకే భవనాలు నిర్మించాలని గ్రేటర్ కమిషనర్ అశ్విని అన్నారు. నగరంలోని గోపాల్‌పూర్, భీమారం, కిట్స్ కళాశాల ప్రాంతం, సిద్ధార్థనగర్, ప్రకాశ్‌రెడ్డి పేట, శంభునిపేట ప్రాంతాల్లో భవన నిర్మాణాల మంజూరు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీ కోసం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. టీఎస్ బీపాస్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ వెంకన్న, సీఎంహెచ్‌వో రాజేశ్, టౌన్‌ప్లానింగ్ అధికారి బషీర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బాషానాయక్, భీమయ్య, కరుణాకర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

ఓటరు స్లిప్పులు అందజేయాలి

అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హనుమకొండ, ఏప్రిల్ : ఓటరు స్లిప్పులను బూత్ స్థాయి అధికారులు(బీఎల్వో) సంబంధిత పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లకు అందజేయాలని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని బీఎల్వోలకు ఓటరు స్లిప్పుల పంపిణీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు స్లిప్పులను ఈ నెల 25వ తేదీ నుంచి మే 8వరకు ప్రతి ఓటరుకు అందజేసి సంతకాలు తీసుకోవాలన్నారు. వేరే ఎవరికీ ఏక మొత్తంగా అందించొద్దన్నారు. ఓటింగ్ శాతం పెంచేందుకు బీఎల్వోలు కృషి చేయాలని సూచించారు. సెక్టార్ అధికారులు ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి స్థాయిలో జరిగేలా కృషి చేయాలన్నారు. అనంతరం బీఎల్వోలకు ఓటరు స్లిప్పులను అందజేశారు. సమావేశంలో పశ్చిమ ఏఆర్వో, హనుమకొండ ఆర్డీవో వెంకటేశ్, తహసీల్దార్లు విజయ్‌కుమార్, బావ్‌సింగ్ పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుడిని కోల్పోయా..

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

సంతోష్‌కుమార్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ, ఏప్రిల్ 24 : దోమకుంట్ల సంతోష్‌కుమార్ అకాల మరణం తనకు, పార్టీకి తీరని లోటని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. యువ నాయకుడు సంతోష్ కుమార్ బుధవారం అనారోగ్యంతో మరణించగా, దాస్యం బాలసముద్రంలోని ఆయన ఇంటికి వెళ్లి శ్రద్ధాంజలి ఘటించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంత్య క్రియల్లో పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే

గాయపడిన వ్యక్తితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

కమలాపూర్, ఏప్రిల్ 24 : హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. సోమవారం మండలంలోని మర్రిపల్లిగూడెం నుంచి కన్నూరు గ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్ ఢీ కొన్న ఘటనలో మధు గాయపడి ఉండడాన్ని చూసిన ఎమ్మెల్యే వెంటనే తన కాన్వాయ్ ఆపి చికిత్స కోసం ప్రైవేట్ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్‌కు ఫోన్ చేసి కోరారు.

పోటాపోటీగా నామినేషన్లు

నామినేషన్ పత్రాలు అందజేస్తున్న అరూరి

వరంగల్, ఏప్రిల్ 24 (నమస్తేతెలంగాణ): నామినేషన్ల స్వీకరణ తుదిగడువు సమీపించడంతో వరంగల్ పార్లమెంట్ ఎన్నికల బరిలో దిగే అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రావీణ్యకు అందజేస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్‌కుమార్ తరపున పార్టీ నేతలు బుధవారం వేర్వేరుగా రెండు సెట్లను ప్రావీణ్యకు అందజేశారు. కాంగ్రెస్ తరపున కడియం కావ్య మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థిగా అరూరి రమేశ్ నామినేషన్ దాఖలు చేశారు.

ఉప్పల్ స్టేషన్‌ల్లో పలు రైళ్ల హాల్టింగ్ ఎత్తివేత

కాజీపేట/కమలాపూర్, ఏప్రిల్ 24 : కాజీపేట-బల్లార్షా సెక్షన్‌లోని ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో ఈ నెల 25 నుంచి 27 వరకు అప్‌లైన్‌లో పలు ప్రయాణికుల రైళ్ల హాల్టింగ్ ఎత్తివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. స్టేషన్‌ల్లో అప్‌లైన్‌లో జరుగుతున్న ఇంజినీరింగ్ పనుల వల్ల కాజీపేట-సిర్‌పూర్ మధ్య నడిచే రామగిరి, హైదరాబాద్-సిర్‌పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, భద్రాచలం రోడ్డు-బల్లార్షా మధ్య నడిచే సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్, సికింద్రాబాద్-సిర్‌పూర్ కాగజ్ నగర్ మధ్య నడిచే కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-సిర్‌పూర్ కాగజ్ నగర్ మధ్య నడిచే భాగ్యనగర్ రైళ్ల స్టాప్‌ను మూడు రోజుల పాటు రద్దు చేశారు. ప్రయాణికులు గమనించాలని వారు కోరారు.

ఇన్‌కంట్యాక్స్ కార్యాలయం ప్రారంభం

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మిథాలి మధుస్మిత

వరంగల్, ఏప్రిల్ 24 : ములుగు రోడ్డు సమీపంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఇన్‌కం ట్యాక్స్ కార్యాలయం ఏర్పాటు చేశారు. బుధవారం ఇన్‌కం ట్యాక్స్ చీఫ్ కమిషనర్ మిథాలి మధుస్మిత కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటి వరకు నక్కలగుట్ట ప్రాంతంలో ఉన్న ఇన్‌కం ట్యాక్స్ కార్యాలయాన్ని వరంగల్, హనుమకొండ ప్రాంతాలకు మధ్య ఉండేలా ఏర్పాటు చేశామన్నారు. మే 15 నుంచి కొత్త కార్యాలయంలో సేవలు ప్రారంభమవుతాయన్నారు.

11కేవీ వైర్ తెగి మక్కజొన్న కంకులు దగ్ధం

సంగెం, ఏప్రిల్ 24 : 11కేవీ విద్యుత్ వైర్ తెగిపడి పంట దగ్ధమైన ఘటన బుధవారం మండలంలో జరిగింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గవిచర్ల గ్రామానికి చెందిన గూడ పెద్ద సుదర్శన్ ఉప్పుకుంట వద్ద గల వ్యవసాయ భూమిలో మక్కజొన్న చేనులో కంకులు విరిసి పక్కన కుప్పలు పోశారు. ఈ క్రమంలో వ్యవసాయ భూమి పక్కన ఎస్ఎస్4 ట్రాన్స్‌ఫార్మర్ కరెంటు 11కేవీ వైర్ తెగిపడింది. దీంతో చేనులో మంటలు చెలరేగి కంకుల కుప్పలకు వ్యాపించాయి. రైతులు చూసి సబ్‌స్టేషన్‌కు సమాచారం అందించి కరెంటు సరఫరా నిలిపివేయించారు. మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనలో మూడెకరాల డ్రిప్పు పైపులు, ఎకరం పామాయిల్, మూడు తాడిపత్రిలు కాలిపోయాయి.

'ఇన్‌స్ట్రక్టర్స్‌ను విధుల్లోకి తీసుకోవాలి'

ఖానాపురం, ఏప్రిల్ 24 : సమగ్రశిక్ష అభియాన్‌లో వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరమళ్ల శశిధర్ కోరారు. ఈ మేరకు బుధవారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ 15 ఏళ్లుగా వివిధ విభాగాల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో 22 వేల మంది పనిచేస్తున్నారన్నారు. గత సెప్టెంబర్‌లో తమ సమస్యలను పరిష్కరించాలని, ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ చేపట్టిన దీక్షకు ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి సంఘీభావం తెలిపారని గుర్తుచేశారు. వారి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 100 రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ప్రస్తుతం తమ సమస్యను పరిష్కరించకపోగా ఇన్‌స్ట్రక్టర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

ఇద్దరు వైద్యుల అరెస్ట్

నెక్కొండ, ఏప్రిల్ 24 : నెక్కొండలో చట్టవిరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఉపేందర్ హాస్పిటల్ డాక్టర్ బాల్నె పార్థుతోపాటు అబార్షన్లు చేస్తున్న శ్రీవెంకటేశ్వర్ క్లినిక్ డాక్టర్ గడుదాసు నమస్కారంను అరెస్ట్ చేసినట్లు నెక్కొండ ఎస్సై మహేందర్ బుధవారం తెలిపారు.

బాలిక అదృశ్యం

శిరీష(ఫైల్)

పర్వతగిరి, ఏప్రిల్ 24 : మూడెత్తులతండాకు చెందిన మూగ, చెవిటి బాలిక జాటోత్ శిరీష(16) ఇంటి నుంచి కనిపించకుండా పోయిందని తండ్రి జాటోత్ బిచ్చా ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీ వెంకన్న తెలిపారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు 8712685242 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

ఆటో బోల్తా పడి మహిళ మృతి

చెన్నారావుపేట, ఏప్రిల్ 24: ఆటో బోల్తాపడి మహిళ మృతి చెందిన ఘటన టేకులకుంటతండా సమీపంలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కరీమాబాద్‌కు చెందిన రావుల సరిత(30) చీరెల వ్యాపారం చేస్తోంది. మండలంలో చీరెలను అమ్ముకొని తిరిగి వెళ్తున్న క్రమంలో టేకులకుంటతండా మలుపు వద్ద ఆటో బోల్తా పడింది. దీంతో సరిత అక్కడికక్కడే మృతి చెందగా, డ్రైవర్ లక్ష్మణ్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ఇద్దరు యువకులకు గాయాలు

నెక్కొండ, ఏప్రిల్ 24: గుండ్రపల్లిలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. గ్రామానికి చెందిన గడ్డల అఖిల్, లాక శివ బుధవారం నెక్కొండ నుంచి గుండ్రపల్లికి బైక్‌పై వెళ్తుండగా బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గోడను ఢీకొట్టింది. దీంతో యువకులు గాయపడగా, వారిని ఎంజీఎం దవాఖానకు తరలించారు.

నేత్రదానం

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 24: హనుమకొండకు చెందిన మామిడిపల్లి వెంకటమ్మ ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందగా ఆమె నుంచి నేత్రాలు సేకరించారు. అనంతరం వెంకటమ్మ కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోన్‌రెడ్డి మల్లారెడ్డి, నేత్ర వైద్యుడు లక్ష్మణ్, సభ్యులు పాల్గొన్నారు.

బోగస్ హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది

- బీజేపీ మతం పేరుతో విషం కక్కుతోంది
- కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఫైర్

సమావేశంలో మాట్లాడుతున్న చల్లా ధర్మారెడ్డి

గీసుగొండ, ఏప్రిల్ 24 : ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు బోగస్ అని ప్రజలకు అర్థమైందని, ఆ పార్టీపై వ్యతిరేకత మొదలైందని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. బుధవారం గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంట గ్రామంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా హామీలను అమలు చేయలేదని విమర్శించారు. గతంలో కేసీఆర్ పాలన ఎలా ఉండేది.. ప్రస్తుతం కాంగ్రెస్ పాలన ఎలా ఉందో ప్రజలకు వివరించి ఓట్లు అడగాలని సూచించారు. అలాగే మతం పేరుతో దేశంలో బీజేపీ విషం చిమ్ముతున్నదన్నారు. ఆగస్టు 15న రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్ మరో కుట్రకు తెరలేపినట్లు వివరించారు. పార్లమెంటు ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు రుణమాఫీ నాటకం ఆడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ హామీలను నమ్మి మళ్లీ ప్రజలు మోసపోవద్దని కోరారు. గ్రామ స్థాయిలో బూత్ లెవల్ కమిటీలు వేసుకొని రోజు 50 మందిని కలుస్తూ ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. 15వ డివిజన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో ఈ ఎన్నికల్లో మెజార్టీ వచ్చే గ్రామాల నాయకులకే కార్పొరేటర్ టికెట్ ఇస్తానని తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను గెలిపిస్తే మన ప్రాంతానికి న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కావ్య, బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ బీఆర్ఎస్ పార్టీని మోసం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు లవ్‌రాజు, డీసీసీబీ డైరెక్టర్ దొంగల రమేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం, సుంకరి శివకుమార్, గోలి రాజయ్య, చిన్నస్వామి, రవీందర్, చిన్ని, జడ్పీటీసీ పోలీసు ధర్మారావు, మండలాధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కడియం కావ్యతో శ్రీధర్‌కుమార్ లోధ్ తదితరులు

అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై చర్యలు తీసుకోవాలి

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కావ్యకు మద్దతు తెలుపడంపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు ఫిర్యాదు

హనుమకొండ, ఏప్రిల్ 24 : ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన కేయూ ఎకనామిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీధర్‌కుమార్‌లోధ్‌పై చర్యలు తీసుకోవాలని శైలేంద్రకుమార్ బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు ఫిర్యాదు చేశారు. తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ చైర్మన్‌గా ఉన్న శ్రీధర్‌కుమార్ లోధ్ కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్యకు మద్దతు పలుకుతున్నారని, ఈ నెల 24న తన సహచరులతో కలిసి ఆమెతో సమావేశమయ్యారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక కేయూ ఉద్యోగి బహిరంగంగా ఒక రాజకీయ అభ్యర్థికి మద్దతు ఇచ్చి ఎన్నికల నియమావళి ఉల్లంఘించారని, అలాగే, సంఘం ఎజెండాకు మద్దతు ఇవ్వాలని కోరినట్లు ఫిర్యాదులో ప్రస్తావించారు. ఈ మేరకు శ్రీధర్ లోధ్‌తోపాటు సహచరులు ఆర్‌డీ ప్రసాద్(ఇంజినీరింగ్ కళాశాల), లక్ష్మారెడ్డి (జువాలజీ విభాగం)పై చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకుల మృతి

వర్ధన్నపేట, ఏప్రిల్ 24: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి ఇల్లంద శివారులోని వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై రాజరాజేశ్వరస్వామి ఆలయం వద్ద జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం నుంచి వరంగల్ వైపు వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు ఎదురుగా వస్తున్న బైక్‌ను రాత్రి 10.50 గంటలకు ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించారు. మృతుల్లో ఇద్దరు ఇల్లందకు చెందిన మల్లెపాక సిద్దు, తొర్రూరుకు చెందిన వరుణ్‌గా గుర్తించారు. మరో మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. చికిత్స పొందుతున్న యువకుడు కూడా ఇల్లంద గ్రామానికి చెందిన పొన్నాల రణజీత్‌గా గుర్తించినట్లు గ్రామస్తులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

- జనరల్ విభాగం ఫస్టియర్‌లో 52 శాతం
- సెకండియర్‌లో 62 శాతం ఉత్తీర్ణత
- ఒకేషనల్ విభాగం ఫస్టియర్‌లో 50 శాతం
- సెకండియర్‌లో 61 శాతం ఉత్తీర్ణత

గిర్మాజీపేట, ఏప్రిల్ 24: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో వరంగల్ జిల్లాలో బాలికలు పైచేయి సాధించారని డీఐఈవో కాక మాధవరావు తెలిపారు. జనరల్ విభాగం ఫస్టియర్‌లో బాలికలు (1912/3029) 63.12 శాతం, బాలురు (749/2094) 35.77 శాతం కలిపి మొత్తం ఫస్టియర్‌లో (2661/5123) 51.94 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఒకేషనల్ విభాగం ఫస్టియర్‌లో బాలురు (88/293) 30.03 శాతం, బాలికలు (303/491) 71 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ ఒకేషనల్‌లో మొత్తం (391/784) 51.39 శాతం నమోదైంది. అలాగే, జనరల్ విభాగం సెకండియర్‌లో బాలికలు (2207/3037) 72.67 శాతం, బాలురు (952/2036) 46.76 శాతం కలిపి (3159/5073) 62.21 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విభాగం సెకండియర్‌లో బాలురు(96/273) 35.16 శాతం, బాలికలు (421/568) 74.12 శాతం కలిపి మొత్తం (517/841) 61.47 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల హవా

ఫస్టియర్ ఎంపీసీలో ఖానాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి షేక్ అబ్దుల్లా (463/470), నర్సంపేట జీజేసీ నుంచి కే రిషికేశ్‌రెడ్డి 470కి 458 మార్కులు సాధించారు. బైపీసీలో నర్సంపేట జీజేసీకి చెందిన జే జాహ్నవి (427/440), సంగెం జీజేసీ నుంచి పీ నిషారాణి (421/440), సీఈసీలో కృష్ణాకాలనీ జీజేసీ నుంచి సయ్యద్ సాధియా తబస్సుమ్ (486/500), జెరాఖాన్ (434/500), హెచ్‌ఈసీలో ఏ లక్ష్మీప్రసన్న (453/500), బీ శారద 500లకు 447 మార్కులు సాధించారు. సెకండియర్ ఎంపీసీలో సంగెం జీజేసీ నుంచి జే సాహితి (977/1000), ఎన్ అలేఖ్య (975/1000),